వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప
- ప్రచారంలో అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు

రొళ్ల: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, మడకశిర ఎన్నికల ఇన్‌చార్జ్ బి.అనంతరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఎం.రాయాపురం పంచాయతీలోని హునిసేకుంట, చర్లోపల్లి, ఎంఆర్ గొల్లహట్టి, ఎం.రాయాపురం, సీఎం ఘట్ట, సీఎం ఘట్ట ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీతో పాటు బండ్రేపల్లి, బంద్రేపల్లి, గొల్లహట్టి, హులికుంట పంచాయతీలోని వన్నారనపల్లి, హులికుంట, దొమ్మర హట్టి, శివబాలయోగి నగరంతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను ప్రజలకు అందజేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, మడకశిర అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ బి.అనంతరాజు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల పాటు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఇప్పుడు మళ్లీ ప్రజలను మోసగించడానికి సూపర్ సిక్స్ పేరుతో బూటకపు హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. గతంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చెప్పి మహిళలను మోసం చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.


రొళ్ల మండలం ఎం.రాయాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

రొళ్ల: మండల పరిధిలోని ఎం.రాయాపురం పంచాయతీ హునిసేకుంటలో మాజీ డీలర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తిప్పేస్వామి తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన తిప్పేస్వామికి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

సన్మానం

రొళ్ల: మండల పరిధిలోని ఎం.రాయాపురం పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, అమరాపురం మండలం పుల్లికుంట గాళిదానేగౌడు, గొడనకుంట రామలింగప్ప తదితరులు ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పతో పాటు మడకశిర అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ బి.అనంతరాజును సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ రత్నమ్మ, సర్పంచులు నరసింహప్ప, కరియమ్మ, తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, మండల జేసీఎస్ కన్వీనర్ కేటీ నాగేంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాం నాయక్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంతోష్, పార్టీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, వార్డు మెంబర్ వజీర్ సాబ్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్ రంగారెడ్డి, మారేగౌడు, కాంతరాజు, దొడ్డయ్య, శశికుమార్, సీఎం ఘట్ట రవి, దయానంద్, రవికుమార్, ముద్దారెడ్డి, దేవరాజు, మంజునాథ్, చిత్తయ్య, బసవరాజు, ఆనంద్‌నాయక్, నారాయణప్ప, సోమశేఖర్, రామక్రిష్ణప్ప, భీమన్న, పాండురంగప్ప, తిప్పేస్వామి, పల్లికుంట గాళిదానేగౌడు, గొడనకుంట రామలింగప్ప, ఎంపీటీసీ నాగరాజు, వైస్ సర్పంచ్ రవికుమార్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందాం

గుడిబండ: నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి రెండోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. శుక్రవారం దేవరహట్టి గ్రామంలో ఎంపీపీ రాధమ్మను ఈరలక్కప్ప కలిశారు. ఎంపీపీ రాధమ్మ మాట్లాడుతూ.. పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. అలాగే పి.గొల్లహట్టి గ్రామానికి చెందిన నటరాజు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచులు జీబీ కరుణాకర్, అశ్వత్, నాయకులు రంగధామ, తిమ్మన్న, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


కాంగ్రెస్ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి ఇంటి ఆవరణలో శుక్రవారం మండలంలోని ఎగువ అచ్చంపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైసీ గోవర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి సమక్షంలో వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ కార్యకర్తలు హనుమంతనాయక్, రాయుడు నాయక్, నాగరాజు నాయక్, కృష్ణానాయక్, భీమరాజునాయక్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌నాయక్, మూర్తి, తిమ్మరాయప్ప,రుద్రప్ప, విజయకుమార్, ప్రకాష్ నాయక్, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అగళి: మండల పరిధిలోని పి.బ్యాడగెర చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ వీరేష్ తెలిపారు. బీఎస్‌ఎఫ్ జవాన్లతో సోదాలు నిర్వహించారు. అనుమానిత కార్లు బస్సులను విస్తృతంగా తనిఖీ చేశారు.

క్లుప్తంగా

ఇరువర్గాలను రాజీ చేసిన మంత్రి


ఇరువర్గాలను రాజీ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ భార్త నాగేనాయక్, ఉపసర్పంచ్ రాజారెడ్డిని మంత్రి ఉషశ్రీచరణ్ శుక్రవారం రాజీచేశారు. వీరు ఒకరిపై ఒకరు సోషల్ మీడియాలో ఆరోపణలు చేసుకుంటున్న నేపథ్యంలో మంత్రి ఇరువురితో మాట్లాడి, రాజీ కుదిర్చారు. ఉప సర్పంచ్ రాజారెడ్డి రెండు రోజులక్రితం వీధి లైట్లు ఏర్పాటు విషయంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడ్డారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యానికి కారణం సర్పంచ్ భార్త నాగేనాయకే అని భావించిన రాజారెడ్డి , సర్పంచ్‌పై ఆరోపణలు చేసిన విషయం విదితమే.

సీఎం జగన్‌తోనే సంక్షేమం,అభివృద్ధి


చిలమత్తూరు బీసీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్సీపీ శ్రేణులు

చిలమత్తూరు: సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్ తోనే సాధ్యమని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ, ప్రజా సంక్షేమంతో పాటు నియోజకవర్గం అభివృద్ధి జరగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే బాలకృష్ణ అవసరం తీరగానే హైదరాబాద్‌కో. సినిమా షూటింగ్‌లకు వెళ్లి పోతాడని, అలాంటి వ్యక్తికి ఓటేస్తే హిందూపురం అభివృద్ధి మళ్లీ వెనక్కి వెళ్లి పోతుందన్నారు. ఎమ్మెల్యేగా దీపిక, ఎంపీగా శాంతమ్మను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రాఘవేంద్రరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, మండల మాజీ కన్వీనర్లు సదాశివరెడ్డి, మద్దిపి లక్ష్మీనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దివాకర్‌రెడ్డి, నాయకులు సురేష్‌కుమార్ రెడ్డి, అన్సర్ అహ్మద్, గిరీష్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, షాకీర్, హరి, నాగభూషణరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, కులశేఖర్‌రెడ్డి, నయిముల్లా, కదిరప్ప, చిన్నప్పయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ



జెడ్పీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎన్నికల పరిశీలకుడు బాబు రెడ్డి

పెనుకొండ రూరల్: ఇటీవల గుండె పోటుతో మృతిచెందిన జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు కుటుంబాన్ని ఎన్నికల పరిశీలకుడు బాబురెడ్డి శుక్రవారం పరామర్శించాడు. ఉదయం గుట్టూరు గ్రామానికి చేరుకొని శ్రీరాములు భార్య నాగరత్నమ్మ, కుమారుడు నాగరాజు, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. క్యాక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, మండల కన్వీనర్ బాబు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రామ్మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,బైపురెడ్డి, దుర్గప్ప, రవి, నారాయణస్వామి, కాంట్రాక్టర్ రాము, పిట్టా బాబు,నటేష్ తదితరులు హాజరయ్యారు.

టోఫెల్ పరీక్ష నిర్వహణ పరిశీలన

రొళ్ల: మండల వ్యాప్తంగా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం 6వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు టోఫెల్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హొట్టేబెట్ట జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన టోఫెల్ పరీక్ష నిర్వహణను ఎంఈఓ శ్రీధర్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర దేశాలకు దీటుగా ఆంగ్లంలో విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవడం కోసం టోఫెల్ పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు.

వైభవంగా పంచమ జ్యోతుల ఉత్సవం


చౌడేశ్వరిని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: వైఎన్ హొసకోట గ్రామంలో శుక్రవారం తొగట వీర సామాజిక వర్గం ఆరాధించే చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల ఉత్సవం వైభవంగా జరిగింది. గౌడ సంద్రం మారెమ్మ ఆలయం ఎదుట ప్రారంభమైన ఊరేగింపు ప్రధాన వీధుల్లో కొనసాగి చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద ముగిసింది. పలువురు భక్తులు బాయి బీగ (నోటి తాళం) వేయించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు జ్యోతులు మోశారు. వందలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు


గంగంపల్లి గ్రామంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

- మంత్రి ఉషశ్రీ చరణ్

గోరంట్ల: ఎన్నికల్లో చంద్రబాబు చెప్పే మాయ మాటలు ఎవరూ నమ్మొద్దండని శిశు సంక్షేమశాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉషశ్రీచరణ్ ప్రజలను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని గంగంపల్లి, గౌనివారిపల్లి, మలసముద్రం గ్రామ పంచాయతీల పరిధిలోని గంగంపల్లి, గంగంపల్లితండా, ఎగువ గంగంపల్లి, గౌనివారిపల్లి, శీనప్పల్లి, కమ్మలవాండ్లపల్లి, చెట్లమోరంపల్లి, మలసముద్రం, జక్కసముద్రం, బూదిలివాండ్లపల్లి, కోరేవాండ్లపల్లి గ్రామాల్లో మంత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో చేశారు. అనంతరం మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు అధికారమే ధ్యేయంగా అనేక మోసపూరిత హామీలను ఇచ్చి, అధికారం చేపట్టిన తరువాత హామీలను తుంగలో తొక్కారన్నారు. అన్ని వర్గాలనూ మోసం చేశాడన్నారు. మరోసారి ప్రజలను మోసం చేయడానికి ఆచరణ సాధ్యంకాని హామీలను ఇస్తూ మరోసారి మోసం చేయడానికి ప్రజల ముందుకు వస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీలను అమలు చేసి పేదలు పక్షపాతిగా నిలిచారని, పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందాం

- ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

లేపాక్షి: రాష్ట్రంలో నవరత్నాల కింద సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని హిందూపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక కోరారు. శుక్రవారం ఉదయం మండలంలోని కొండూరు, వడ్డిపల్లి, తిమ్మగానపల్లి, లక్కేపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం మండలంలోని మైదుగోళం గ్రామంలో ప్రచారం చేశారు. మొదట కొండూరులోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ అబద్ధాలు చెప్పి ఓట్లు అడుగుతారని, వారిని నమ్మొద్దన్నారు. సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ లీలావతి, ఎంపీటీసీ అశ్వత్థప్ప, నాయకులు మైదుగోళం రామాంజి, మహమ్మద్, రవి, సుధాకర్, జుబేర్, మురళీరెడ్డి, నారాయణరెడ్డి, గణేష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీరామప్ప, ప్రభాకర్‌రెడ్డి, గంగాధరప్ప, రంగప్ప, మల్లిరెడ్డి, సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.


కొండూరులో ఓటు అడుగుతున్న వైఎస్సార్‌సీపీ హిందూపురం అభ్యర్థి దీపిక

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

లేపాక్షి మండలంలోని మైదుగోళం గ్రామంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ప్రారంభించారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆమె మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించడానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, మండల కన్వీనర్ నారాయణ స్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు రామాంజి, జుబేర్, మహమ్మద్, రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా పంచమ జ్యోతుల మహోత్సవం

సోమందేపల్లి: మండల కేంద్రంలో చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల మహోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. తెల్లవారు జామున అమ్మవారికి పుర వీధుల్లో ఊరేగించారు. పంచమ జ్యోతులను తలపై పెట్టుకొని భక్తులు నాట్యం ఆడారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది జ్యోతుల మహోత్సవానికి తరలి వచ్చారు. చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షుడు డీసీ.ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. గ్రామమంతా విద్యుత్ దీపాలంకరణ చేశారు.

ఊరేగింపులో పాల్గొన్న మంత్రి : పంచమ జ్యోతుల ఊరేగింపులో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి ఉషశ్రీ చరణ్ పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు మంత్రికు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, ఎంపీపీ గంగమ్మ, మాజీ ఎంపీపీ వరలక్ష్మి, వైస్ సర్పంచ్ వేణు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ చరణ్

పార్టీ గెలుపునకు కృషి చేయాలి

మడకశిర: ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ గెలుపునకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పార్టీ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్ కోరారు. శుక్రవారం మడకశిర మాజీ సర్పంచ్ ఎస్ఎన్ కృష్ణమూర్తిని కలిశారు. పార్టీ ఎన్నికల ప్రచారంపై చర్చించారు. మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. మున్సిపాలిటీ పరిధిలో పార్టీ అభ్యర్థులకు మెజార్టీ రావాలన్నారు. సంక్షేమ పథకాలను వివరించి పార్టీని గెలిపించాలని కోరారు. ప్రతి వార్డులో కూడా నాయకులను సమన్వయం చేసుకుని పని చేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. అనంతరం అశోక్‌కుమార్‌ను కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, రశేఖర్ రెడ్డి, జీబీ శివకుమార్, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, జెడ్పీటీసీ మూర్తి, నాయకులు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పార్టీ పరిశీలకుడు అశోక్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 40 కుటుంబాలు

వైఎస్సార్‌సీపీలో 40 కుటుంబాల చేరిక

మడకశిర: పట్టణంలోని 3వ వార్డు పరిధిలోని 40 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్ వీరికి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, పట్టణ నాయకులు సురంగల శ్రీనివాస్, సురంగల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో బాలికల ప్రతిభ


రొద్దం: 961 మార్కులు సాధించిన కుమారుడికి స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు


ఎం.పూర్ణిమ(988), హిందూపురం


పూర్ణిమ (988) , పరిగి


లక్ష్మి, 978, గుడిబండ


కె.పవిత్ర 966, గుడిబండ


లయనిక (432), గుడిబండ


వెంకటేశులు 959, మడకశిర


ఎస్.అఫ్రీన్ (953), హిందూపురం


ఎ.సంధ్య (924), హిందూపురం


మిథున్ 462, మడకశిర


హిమబిందు, 458, గుడిబండ

హిందూపురం టౌన్: శుక్రవారం విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 235 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 77.44శాతంతో 182 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరంలో 273 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా, 60శాతం ఉత్తీర్ణతతో 164 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. అలాగే సీ.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 40శాతం, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 73శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. అలాగే పట్టణంలోని విద్యానిధి జూనియర్ కళాశాలలో చదువుతున్న ఎం .పూర్ణిమ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 988 మార్కులు సాధించింది.

లేపాక్షి లేపాక్షిలోని మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ పరిక్షల్లో 132 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 93 మంది ఉత్తీర్ణులయ్యారని, రెండో సంవత్సరం ఇంటర్ పరిక్షల్లో 111 మంది విద్యార్థులకుగానూ 106 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు.

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బైరేకుంట వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో విద్యార్థులు 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ భీముడు నాయక్ తెలిపారు. మొదటి సంవత్సరంలో 49.30 శాతం రాగా ఒకేషనల్‌లో మొదటి సంవత్సరంలో 37 శాతం , రెండో సంవత్సరంలో 77.40 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు

ఇంటర్‌లో డ్రైవర్ కుమార్తె ప్రతిభ

గోరంట్ల: ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాల్లో మోహన్‌రావు కాలనీకి చెందిన డ్రైవర్ ఈడిగ నీళ్ల రవి, పుష్పావతి దంపతుల కుమార్తె నవ్య ప్రతిభ కనబరిచింది. ఇంటర్ ఫలితాల్లో ఆమె 913 మార్కులు సాధించింది.

203 మంది ఉత్తీర్ణత

గుడిబండ: స్థానిక గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.జ్యోతి తెలిపారు. మొత్తం 203 మంది విద్యార్థులుండగా అందరూ పాసైనట్లు పేర్కొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల ప్రభుత్వ మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మంచి ఫలితాలు వచ్చాయని ప్రిన్సిపాల్ మురళీధర్‌రావు తెలిపారు.

రొళ్ల: ఇంటర్ ఫలితాల్లో ఆవినకుంట కేజీబీవీ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఎస్‌ఓ ఎస్. మున్నావర్‌జాన్ పేర్కొన్నారు.

అమరాపురం: ఇంటర్ ఫలితాల్లో ఏపీ మోడల్ పాఠశాల, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్స్ ఓబళపతి, పద్మావతి తెలిపారు.

పరిగి: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు నిర్వహించిన పరీక్షల ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. మండలంలోని ఏపీఆర్‌జేసీతో పాటు విద్యానిధి, ఏఎం లింగణ్ణ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షలు రాశారు. శుక్రవారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పూర్ణిమ 988 మార్కులు సాధించింది. ఏపీఆర్‌జేసీలో సైతం మంచి మార్కులను సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు.

రొద్దం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 66 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మద్దులేటి శుక్రవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 71 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 25 మంది ఉత్తీర్ణత పొందారు. రెండో సంవత్సరంలో 61 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 40 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సినల్ వివరించారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సాయిభార్గవ్ 961 మార్కులు సాధించాడు. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న అరుణ, నాగేంద్ర కుమారుడు బీఎన్ సాయి భార్గవ్ కుటుంబం బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

వలంటీర్ల రాజీనామా

గోరంట్ల: మండల పరిధిలోని బూదిలి సచివాలయ పరిధిలోని 22 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను ఎంపీడీఓ పరిపాలన అధికారి సూర్య నారాయణకు శుక్రవారం అందించారు.

హిందూపురం: మండలంలోని మలుగూరు గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేశారు. వలంటీర్లు మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవడమే లక్ష్యమన్నారు.

అమరాపురం: మండలంలోని కె.శివరం, హేమావతి గ్రామ సచివాలయాల పరిధిలోని ఏడుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామ పత్రాలను ఎంపీడీఓ మునిస్వామికి అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు మంజునాథ రాజుప్ప, చంద్రప్ప, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రొళ్ల: మండలంలోని మలసముద్రం సమీపంలోని పేకాట స్థావరంపై గురువారం దాడి చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గుడిబండ: మండలంలోని జంబులబండ సమీపంలోని పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.21,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు.

అమరాపురం: మండలంలోని చిట్నడకు గ్రామ శివారులోని పేకాట స్థావరంపై శుక్రవారం దాడి చేసినట్లు ఎస్‌ఐ జనార్ధన నాయుడు తెలిపారు. పది మందిని అదుపులోకి తీసుకుని, ఐదు సెల్‌ఫోన్లు, రూ.27,670 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

పోలీసుల కవాతు

గోరంట్ల: మండలంలోని వానవోలు, దిగువ గంగంపల్లి, ఎగువ గంగంపల్లి గ్రామల్లో సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో బీఎస్‌ఫ్ జవాన్లు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, ఎన్నికలకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ ఎస్‌ఐ అజయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమి పూజ

పెనుకొండ రూరల్: కియా అనుబంధ పరిశ్రమ అయిన గ్లోవిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో రహదారి నిర్మాణానికి భూమి శుక్రవారం పూజ చేశారు. మండలంలోని అమ్మవారిపల్లి నుంచి చిన్నపరెడ్డిపల్లి గ్రామ రహదారిలో దాదాపుగా 200 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 17.50 లక్షలతో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్లోవిస్ కంపెనీ ప్రతినిధులు సాయినాథ్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆర్టీటీ సిబ్బంది లలిత, రాజశేఖర్ రెడ్డి, నాయకులు నడిపి వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోండి

పావగడ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాలూకా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన హోం ఓటింగ్ సౌలభ్యాన్ని 85 ఏళ్లు పై బడిన ఓటర్లు, కోవిడ్‌కు గురైన వారుసద్వినియోగం చేసుకోవాలని స్థానిక విధాన సభ క్షేత్రం ఎన్నికల అధికారి తహసీల్దార్ సంతోష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫారం-డీ ద్వారా ఎంపికైన 85 ఏళ్లు పై బడిన ఓటర్లు 499 మంది, వివిధ కారణాలతో చేత గాని ఓటర్లు 208 మంది ఉన్నారన్నారు.